క్లుప్తంగా

శాస్త్రోక్తంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భాకరాపేట : జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మ ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ ప్రతిమను వేడుకగా ఊరేగించారు. అనంతరం విశేష అభిషేకాలు జరిపించి, విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. అమ్మవారిని వేదపండితులు ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమల, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దైవ చింతనకే 'మెడిటేషన్'


మెడిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో బిషప్, తదితరులు

పాకాల : స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చి 125వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రధాన చర్చిలో మెడిటేషన్ సెంటర్‌ను సీఎస్ఐ వేలూరు డయసిస్ బిషప్ హెచ్.శర్మా నిత్యానందం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవాళి శాంతియుత జీవనానికి బైబిల్‌ను కరదీపికగా క్రైస్తవ సమాజం వినియోగించుకోవాలని సూచించారు. దైవ చింతనకు మెడిటేషన్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. రెవరెండ్ ఐ.జయకరన్, రెవరెండ్ బి.హేమ్‌కుమార్, విక్టర్ ఎం.రాఘవేలు,అరుల్‌సెల్వి, వినోద్‌కుమార్, ప్రమీల మార్గరెట్, ప్రదీప్‌కుమార్, జాన్‌ఫెలిక్స్, నోయల్‌రాజ్, విక్టోరియా పాల్గొన్నారు.

యాజమాన్యంతో అధిక దిగుబడి

పాకాల : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని డీఆర్సీ వ్యవసాయాధికారి శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం కె.ఒడ్డేపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 80 అర్జీలు

తిరుపతి అర్బన్: నగరంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 80 అర్జీలు వచ్చాయి. తొలి రోజు కచ్చేపిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కేవలం 10 అర్జీలు మాత్రమే వచ్చాయి. రెవెన్యూ సదస్సుల ప్రచారం లేకపోవడంతో తొలిరోజు ఎవరికి తెలియలేదు. ఈ అంశంపై సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం అక్కారంపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. దీంతో 80 అర్జీలు వచ్చాయి. ముఖ్యంగా 22ఏపై ఎక్కువ వినతులు అందాయి. తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మితోపాటు డిప్యూటీ తహసీల్దార్ రామచంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం

తిరుపతి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం లభిస్తోందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం తెలిపారు. మూడు రోజులుగా ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ మండలం వేమూరు పంచాయతీలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. దామా అయ్యప్ప నాయుడు పీఎండీఎస్ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలు పరిశీలించారు. వ్యవసాయాధికారులు రవిచంద్రప్రసాద్, నీలమ్మ, మధు, గీతారాణి, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కక్షగట్టి దళిత ఎఫ్ఏపై వేటు


మాట్లాడుతున్న ఎంపీపీ యశోద, పక్కన వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

తిరుపతి రూరల్ : టీడీపీ నేత కక్షగట్టి కుట్రపూరితంగా సి.గొల్లపల్లెకు చెందిన దళిత ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవిపై సస్పెన్షన్ వేటు వేయించారని తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద ఆరోపించారు. బాధితురాలిపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి అన్యాయం చేశారని మండిపడ్డారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కనీస ఆధారాలు లేకుండా రమాదేవిని తొలగించారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షలకు అధికారులు వత్తాసు పలకడం సరికాదని స్పష్టం చేశారు.

రేపటి నుంచి విద్వాన్ మహాసభ

తిరుపతి కల్చరల్ : బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి తిరుపతిలోని కంచి మఠంలో విద్వాన్ మహాసభ నిర్వహించనున్నట్లు సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి హాజరవుతున్నట్లు వెల్లడించారు.

పాకాల మీదుగా విజయవాడకు బస్సు

పాకాల : ప్రయాణికుల సౌకర్యార్థం పుంగనూరు నుంచి పాకాల మీదుగా విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు పుంగనూరు డీఎం సుధాకరయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరులో సాయంత్రం 5.30కు బయలుదేరి పాకాలకు 7.30 గంటలకు వస్తుందన్నారు.

అనాథ వేదన.. అరణ్య రోదన!

తిరునగరంలో యాచకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న అభాగ్యులకు తిరుపతి నిలయంగా మారుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రానికి బెగ్గింగ్ కల్చర్ అపకీర్తిని తీసుకువస్తోంది. ఫుట్‌పాత్‌లపై చేరుతున్న నిరాశ్రయుల కారణంగా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారవుతోంది. కలుషితమవుతున్న వాతావరణం దేశవిదేశాల నుంచి తరలివస్తున్న యాత్రికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ క్రమంలో దిక్కులేని వారికి అండగా నిలవడంలో సర్కారు విఫలమవుతోంది. కేంద్ర ప్రభుత్వ సాయం అందిపుచ్చుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఆశ్రయం.. సక్రమంగా ఆహారం అందని అనాథల వేదన.. అరణ్య రోదనగా మారుతోంది.

- తిరుపతికి పెద్దసంఖ్యలో చేరుతున్న అభాగ్యులు
- ఫుట్‌పాత్‌లే ఆవాసం
- భిక్షాటనతోనే జీవనం
- బెగ్గర్స్ హోమ్.. నైట్ షెల్టర్ల ఏర్పాటుకు సిద్ధంగా కేంద్రం
- అవకాశాలను వినియోగించుకోని రాష్ట్ర ప్రభుత్వం

అన్నదాతల కోసం ఎదురుచూస్తూ..



ఫుట్‌పాత్ పై విశ్రాంతి తీసుకుంటూ..



తిరుపతి తుడా : నగరంలో నిరాశ్రయులు, యాచకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ఇక్కడకు చేరుతున్నారు. దీంతో బెగ్గింగ్ కల్చర్ అధికమవుతోంది. గతంలో కొన్నేళ్లపాటు తిరుపతిలో భిక్షాటన చేసేవారిని నియంత్రించారు. ఇటీవల మళ్లీ యాచన వృత్తి పెచ్చుమీరుతోంది.

రద్దీ ప్రాంతాలే అడ్డాగా..

ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, గోవిందరాజుస్వామి ఆలయం, అలిపిరి రోడ్డు, కపిలతీర్థం, గరుడ కూడలి, అలిపిరి లింక్ బస్టాండ్, లీలామహల్ కూడలి తదితర రద్దీ ప్రాంతాలే యాచకులకు అడ్డాగా మారాయి. అలాగే స్విమ్స్ కూడలి నుంచి అలిపిరి వరకు, రుయా ఆస్పత్రి ప్రాంగణం, హరే రామ హరే కృష్ణ రోడ్డు, అలిపిరి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద నిరాశ్రయులకు ఆవాసాలుగా ఉన్నాయి. వీరి నిర్వాకం కారణంగా ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారిపోయాయి. అభాగ్యులని ఎవరైనా ఆహార పొట్లాలు పంపిణీ చేస్తుంటారు. అయితే వాటిని భుజించిన తర్వాత కవర్లను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో పలు ప్రాంతాలు చెత్తమయంగా మారుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతున్నాయి.

పిల్లలతో యాచన

ఇటీవల లీలామహల్ కూడలి ప్రాంతం, ఆర్టీసీ బస్టాండ్, గోవిందరాజస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో చిన్న పిల్లలను వెంటబెట్టుకుని బెగ్గింగ్ చేయడం పెరిగింది. అలాగే చంటి బిడ్డలను ఎత్తుకుని పలువురు మహిళలు యాచిస్తున్నారు. రోడ్డుకు అడ్డం పడుతూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో తీవ్రమైన పొల్యూషన్ కారణంగా చంటి బిడ్డలు అనారోగ్యానికి గురవుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువే..

నిరాశ్రయులు, బెగ్గర్స్ అధికంగా ఉండే ఆ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగానే జరుగుతున్నాయి బహిరంగంగా ధూమం, మద్యం, బంగి ఆకు వంటివి సేవించే వాళ్లకు అడ్డాగా మారుతున్నాయి. మత్తుకు అలవాటు పడినవారు యాత్రికులపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. మహిళల ఎదుట అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందిపెడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

తిరుపతిలో బెగ్గర్స్‌కు ప్రత్యేక హోమ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. యాచకులకు రక్షణ కల్పించడంలో భాగంగా కేంద్రం తీసుకువచ్చిన బెగ్గర్స్ హోమ్ ప్రతిపాదన కేవలం కాగితాలకే పరిమితమైంది. 2023 జనవరి 11వ తేదీన కేంద్ర బృందం తిరుపతిలో పర్యటించి బెగ్గర్స్ హోమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ అంజలి భరద్వాజ్ నేతృత్వంలోని కేంద్ర బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. నిరాశ్రయుల కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న రెండు నైట్ షెల్టర్లను తనిఖీలు చేసి అక్కడ కల్పించిన వసతులపై హర్షం వ్యక్తం చేసింది. అయితే తిరుపతికి మరో రెండు నైట్ సెంటర్‌లతో పాటు ప్రత్యేకంగా బెగ్గర్స్ హోమ్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని అప్పటి అధికారులకు సూచించింది. ఈ మేరకు తిరుపతిలో ఒక బెగ్గర్స్ హోమ్ తోపాటు రెండు నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సైతం పంపించింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రతిపాదనలు అక్కడితో ఆగిపోయాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా ప్రతిపాదనలను గాలికి వదిలేసింది.


అలిపిరి బస్టాండ్ ఆవరణలో..

కేంద్రం నుంచి 60 శాతం నిధులు

నైట్ షెల్టర్ బెగ్గర్స్ హోమ్ నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం ఖర్చులో 60 శాతం భరిస్తుంది. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. మెప్మా పర్యవేక్షణలో ఈ షెల్టర్లను నిర్వహిస్తారు. తిరుపతి నగరంలో ప్రస్తుతం రెండు నైట్ సెంటర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తిరుపతికి ఉన్న ప్రాధాన్యత, జనాభా దృష్ట్యా మరో రెండు నైట్ షల్టర్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. అలానే బెగ్గర్స్ కోసం మరో ప్రత్యేక హోమ్ అందుబాటులోకి తీసుకురావచ్చు. తద్వారా నగరంలోని యాచకులకు పూర్తిస్థాయిలో ఆశ్రయం కల్పించవచ్చు. యాత్రికులు, స్థానికులకు బెగ్గర్స్‌తో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాగే నగర పరిశుభ్రతను మెరుగుపరచవచ్చు.


ఆహారం తినే ఓపిక లేక..


రుయా ఆస్పత్రి వద్ద మత్తులో..


ఫుట్‌పాత్‌నే పాన్పుగా.. చెట్టు నీడన నిద్రిస్తూ..

ఎమ్ఎస్ఎమ్ఈ నమోదు పరిశీలన


సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో చేపట్టిన చిన్న, మధ్యతరగతి పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈ) ఆన్‌లైన్ నమోదును కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. బుధవారం బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ తదితర ప్రాంతాల్లో సచివాలయ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఈ–నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉద్యమ్' పోర్టల్‌లో చిన్న, మధ్య తరగతి పరిశ్రమల నిర్వాహకులు తమ వివరాలు అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు, రాయితీలు సులభంగా పొందవచ్చని వెల్లడించారు. పరిశ్రమల నిర్వహణ సులభతరమవుతుందని, తక్కువ వడ్డీకే రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందని, ప్రభుత్వ టెండర్లకు అర్హులవుతారని వివరించారు. ఈ క్రమంలో సచివాలయం కార్యదర్శులకు పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ మధు బాబు, సచివాలయ కార్యదర్శులు సురేష్, లోకేష్ పాల్గొన్నారు.

మాతృభాషతోనే మన జీవితం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుజ్యోతి

తిరుపతి సిటీ : ఆంగ్లం ఉద్యోగావకాశాలకు మాత్రమేనని, మాతృభాషతోనే మన జీవితం ముడిపడి ఉందని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని తెలిపారు. బుధవారం పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరాప్రియదర్శినీ ఆడిటోరియంలో భారతీయ భాషాదినోత్సవం నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ చిన్నస్వామి సుబ్రమణ్య భారతి జయంతిని భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థినులు సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు.అలాగే డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా భారతీయ భాషోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ మధుజ్యోతి మాట్లాడుతూ భారతీయ భాషల విశిష్టత, అస్తిత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ ఐవీ లలిత కుమారి, హెడ్ డాక్టర్ పి.తవిత తులసి, ప్రొఫెసర్ కె.అనురాధ, డాక్టర్ జి.మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు

సంస్కృత వర్సిటీలో..

జాతీయ సంస్కృత వర్సిటీలో భారతీయ భాషా ఉత్సవ్ నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూ, అద్దంకి ప్రభుత్వ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ గాలి గుణశేఖరన్, ప్రొఫెసర్ శంకర్ నారాయణన్.ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా, సంపత్ కుమార్, ఈశ్వర్‌బాబు, మాసులామణి, చిట్టి కళావతి, మోహన్‌బెహారా పాల్గొన్నారు.

25 వాహనాలు సీజ్

తిరుమల : తిరుపతి– తిరుమలకు రాకపోకలు సాగించే టాక్సీలను బుధవారం రాంబగీచా అతిథిగృహం వద్ద పోలీసులు తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని 25 వాహనాలను సీజ్ చేశారు. ఆయా వాహనాలను ఆర్‌టీఓకు అప్పగించినట్లు ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు

తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బుధవారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. డీపీపీ కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందని తెలిపారు. సంస్కృత వర్సిటీ ఆచార్యులు చక్రవర్తి రాఘవన్, సముద్రాల దశరథ్, రామకృష్ణ శేష సాయి, సునీత, శేఖర్ రెడ్డి ,శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

నేడు అక్కదేవతలకు ఆరాధన

తిరుమల : తిరుమల మొదటి కనుమ రహదారిలోని అక్కదేవతల గుడిలో ఏడుగురు అక్కదేవతలకు 13వ తేదీ ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో కార్తీకమాస పూజలు నిర్వహించనున్నారు. అక్కదేవతలకు ఏటా కార్తీకమాస పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. 2008 నుంచి అక్కదేవతల గుడిలో ఏటా ఒక రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రారంభించారు.

'గీత'లోనే జీవన సారాంశం


గీతా జయంతిలో అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : భగవద్గీతలోనే జీవన సారాంశం ఉందని, అందులోని శ్లోకాలను అర్థం చేసుకుంటే జీవిత పరమార్థం బోధపడుతుందని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత దిక్సూచి వంటిదని వెల్లడించారు. సంస్కృత అధ్యాపకుడు కోటీశ్వరయ్య మాట్లాడుతూ నేటి తరానికి గీతాపారాయణం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, అధ్యాపకులు మాధన్న, కొండలరావు, శివకుమార్, వసంతకుమార్ పాల్గొన్నారు.

ఆహార భద్రతే లక్ష్యంగా పరిశోధనలు


కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు, అధికారులు

తిరుపతి సిటీ : ఆహార భద్రతే లక్ష్యంగా పరిశోధనల వైపు యువత దృష్టి సారించాలని చెన్నైకు చెందిన ప్రకాష్ ఫీడ్స్ మిల్స్ అధినేత డాక్టర్ ప్రకాష్‌రావు పిలుపు నిచ్చారు. బుధవారం ఎస్వీ వెటర్నరీ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు ఆహార కొరత లేకుండా పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పాండిచ్చేరి పశువైద్య కళాశాల డీన్ డాక్టర్ షెజియన్ మాట్లాడుతూ.. దేశీయ పశుజాతులు జన్యు సమర్థతను అంచనా వేసి ఉపయోగించుకోవాలని సూచించారు. డాక్టర్ సురేష్ హోస్నప్పగల్, రిజిస్ట్రార్ రవికుమార్, డీన్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో తిరుపతి, చింతకాయల వీధికి చెందిన జి. నవీన్‌కు 6 నెలలు జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు.

దిగ్బంధం



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో బస్సులు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. వాహనాల రద్దీతో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో డ్రైవర్లు.. కండక్టర్ల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. లగేజీ ఎక్కించేందుకు బస్సులను ఎక్కడ పడితే అక్కడ ఆపేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్టీసీ అధికారులు కార్గో నిర్వాహకులకు అప్పగించిన రెండు ప్లాట్‌ఫామ్‌లలో ఒకటి తగ్గించడం వల్లే ఇక్కట్లు ఎదురవుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. బస్టాండ్ ప్రాంగణంలోనే బస్సులను ఆపి ప్యాకేజీలను ఎక్కిస్తుండడం వల్లే ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నట్లు వెల్లడవుతోంది. ఈ క్రమంలోనే బుధవారం సెంట్రల్ బస్టాండ్‌లో వాహనాలు చిక్కుకున్నట్లు అవగతమవుతోంది. – తిరుపతి అర్బన్

జర్నలిస్టులపై దాడులు సహించం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

తిరుపతి తుడా: జర్నలిస్టులపై దాడులను సహించే ప్రసక్తే లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని జర్నలిస్టు సంఘాల నేతలు హెచ్చరించారు. సినీ నటుడు మంచు మోహన్ బాబు తో పాటు ఆయన సిబ్బంది మీడియా ప్రతినిధులపై వరుసగా దాడులకు పాల్పడుతుండడంతో బుధవారం తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. దాడులకు పాల్పడ్డ దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళీకృష్ణ, బాలచంద్ర మాట్లాడుతూ రంగంపేటలో సుమన్ టీవీ రిపోర్టర్ కెమెరామన్‌పై ఎంబీయూ సిబ్బంది రెండు రోజుల క్రితం దాడి చేయడం బాధాకరమన్నారు. కిడ్నాప్ చేసేందుకు యత్నించడం సిగ్గుచేటని మండిపడ్డారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర, నేతలు నేతాజీ , రాజు, తిరుమల రవి, బొబ్బా రాజేంద్ర, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో మొదటి కంపార్ట్‌మెంట్ నిండిపోయింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,284 మంది స్వామి వారిని దర్శించుకోగా 19,064 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.27 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కలిగిస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూ లైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.